క్లుప్తంగా

కలెక్టర్ దృష్టికి హాస్టళ్ల సమస్యలు

మామిడికుదురు: స్థానిక బాలికల, బాలుర వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను కలెక్టర్ హిమాన్షు శుక్లా దృష్టికి తీసుకు వెళ్లాలని నిర్ణయించారు. తద్వారా వాటికి పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరాలని నిర్ణయించారు. జెడ్పీటీసీ సభ్యుడు కశిరెడ్డి అంజిబాబు, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు రెండు హాస్టళ్లను పరిశీలించారు. బాలిక వసతి గృహంలో 80 మంది విద్యార్థినిలకు ఒకే కుళాయి పని చేస్తోందని, దీని వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కుళాయిలు ఉన్నా అవి నామమాత్రంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. బాలుర వసతి గృహంలో సమస్యలను గుర్తించారు. వీటిని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ పంట నమోదు పరిశీలన

పి.గన్నవరం: జిల్లాలో 99 శాతం ఈ పంట నమోదు కార్యక్రమం పూర్తయిందని జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ తెలిపారు. మండలంలోని మొండెపులంక గ్రామంలో మంగళవారం ఈ పంట నమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. మిగిలిన ఒక శాతం నమోదును త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోతవరం, జి.పెదపూడి గ్రామాల్లో వరి పంట ముందుగా కోతకు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నద్ధం కావాలని అధికారులను ఆదేశించారు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు ఏడాది జైలు

మలికిపురం: వేగంగా, నిర్లక్ష్యంగా ట్రాక్టర్‌ను నడిపి ఒక సైకిలిస్టు మృతికి కారణమైన గూడపల్లి పల్లిపాలెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ లంకే డేవిడ్‌కు ఒక ఏడాది జైలు శిక్ష విధిస్తూ రాజోలు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.హిమబిందు మంగళవారం తీర్పు ఇచ్చారు. 2020 సంవత్సరంలో మలికిపురం మండలం అడవిపాలెం గ్రామానికి చెందిన తాడిచర్ల నాగ వీర వెంకట సత్యనారాయణను ట్రాక్టర్ ఢీకొనడంతో మృతిచెందాడు. అప్పటి ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ నల్లి ఆనంద్ కేసును వాదించగా కోర్టు కానిస్టేబుల్ హసన్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టడంతో నేరం రుజువైంది.

ఘనంగా పోస్టల్ దినోత్సవం

మామిడికుదురు: జాతీయ తపాలా దినోత్సవాన్ని మామిడికుదురులో మంగళవారం నిర్వహించారు. నగరం పోస్టుమాస్టర్ డి.రాజేష్‌కుమార్ దేశ తపాలా వ్యవస్థ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు సేకరించిన పలు రకాల పోస్టల్ స్టాంపులు, పోస్టు కార్డులను, తపాలా పెట్టెను తయారు చేసి ప్రదర్శించారు.

నా మట్టి-నా దేశం మట్టి ఊరేగింపు

మామిడికుదురు: నా మట్టి-నా దేశం కార్యక్రమంలో భాగంగా 18 గ్రామాల నుంచి కలశాల ద్వారా సేకరించిన మట్టిని మంగళవారం ఒక చోటకు చేర్చారు. కలశాలతో ఈ మట్టిని ఊరేగించారు. అనంతరం ఆ మట్టిని విజయవాడ తరలించారు. అక్కడి నుంచి ఢిల్లీకి తీసుకు వెళ్తారని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఏపీఓ మేడిది సీతారామ్ చెప్పారు.

గ్రామాల నుంచి మట్టి సేకరణ

పి.గన్నవరం: గ్రామాల నుంచి సేకరించిన మట్టిని సర్పంచ్‌లు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. జేసీ నుపూర్ అజయ్, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, తాత్కాలిక ఎంపీపీ పాలూరి వీరభద్రరావు, తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ ఎం.భారతి పాల్గొన్నారు.

పంటలు కాపాడే రైతు మిత్రలేవి?

- విచ్చలవిడిగా క్రిమి సంహారక మందుల వినియోగం
- క్రమంగా అంతరించిపోతున్న మిత్ర పురుగుల సంతతి



వరి పంటపై పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

కొత్తపేట: పంటలను ఆశించే చీడ పురుగులను నివారించి, పంటలకు మేలు చేకూర్చే మిత్ర పురుగులు అంతరించి పోతున్నాయి. పంటలను ఆశించి కీడు చేసే శత్రు పురుగులను ప్రత్యక్షంగా నివారించడం ఎంత ముఖ్యమో.. పరోక్షంగా పంటలను కాపాడే మిత్ర పురుగులను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం. క్రిమి సంహారక మందులు మోతాదుకు మించి వినియోగించడం వల్ల శత్రు పురుగులతో పాటు పంటకు మేలు చేకూర్చే మిత్ర పురుగుల జాడ లేకుండా పోతోంది. ఫలితంగా శత్రు పురుగుల తీవ్రత పెరిగిపోయింది. వ్యవసాయ అధికారులు ఎంత చెబుతున్నా రైతులు ఆ విషయాన్ని పెడచెవిన పెట్టి సొంత నిర్ణయాలతో క్రిమి సంహారక మందుల ఎక్కువగా వినియోగిస్తున్నారు. దాంతో మిత్ర పురుగుల సంతతి క్రమంగా అంతరించిపోతోంది.

పంటకు మేలు చేకూర్చే మిత్ర పురుగులు ఇవీ..

ట్రైకో గ్రామ

పంటను ఆశించే పచ్చ పురుగు, లద్దె పురుగులు వాటి సంతతిని గుడ్ల ద్వారా పెంచుతాయి. ఈ పురుగులు పంట ఆకులపైన, పంట లేత భాగాలపైన గుడ్లను పెడతాయి. అలా గుడ్డు నుంచి బయటకు వచ్చిన వాటి సంతతి పూత, ఆకు, పిందెలను తినేసి పంటకు నష్టం కలిగిస్తుంది. ట్రై కోగ్రామ అనే పంట మిత్ర పురుగు పంటపై పచ్చ పురుగు, లద్దె పురుగు పెట్టిన గుడ్లను ఎప్పటికప్పుడు తినేయడం ద్వారా శత్రు పురుగులైన వాటి సంతతి పెరగకుండా పంటను కాపాడుతుంది. అక్షింతల పురుగులు దోమ, నల్లి, తామర తదితర పురుగులను తింటాయి.

సాలీడు, తూనీగ

పచ్చపురుగు, లద్దె పురుగు పంటలపై పెట్టిన గుడ్లు నుంచి బయటకు వచ్చే సంతతి పురుగులు, రెక్కల పురుగులు, దోమలు, నల్లులు సాలీడు గూళ్లలో ఇరుక్కుపోతాయి. వాటిని సాలీడు ఎప్పటికప్పుడు తినేస్తూ వాటి సంతతి పెరగకుండా నివారిస్తుంది. తూనీగలు చీడ పురుగులు పంటలపై పెట్టిన గుడ్లను తినడమే కాకుండా పరపరాగ సంపర్కం జరగటానికి చాలా దోహదపడతాయి. తూనీగ ఒక మొక్కపై నుంచి మరో మొక్కపై వాలినప్పుడు మగ పుష్పంలో ఉన్న పుప్పొడి రేణువులను ఆడ పుష్పంపై వదలడం వలన ఫలధీకరణం జరిగి పిండం, తరువాత విత్తనం, ఆ తరువాత పంట మంచి దిగుబడులకు దోహదపడుతుంది.

మరికొన్ని మిత్ర పురుగులు

కందిరీగ, మిడత, పాడిసన్‌బగ్ వంటి మిత్ర పురుగులు సైతం పంటను ఆశించే చీడ పురుగులు పంటపై పెట్టిన గుడ్లను ఎప్పటికప్పుడు తినేస్తూ వాటి సంతతి పెరగకుండా నివారిస్తాయి. ఇలా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పంటను ఆశించే చీడ పురుగులను నివారించడంలో ఎంతో సాయం చేస్తున్న మిత్ర పురుగులు రైతుల నిర్లక్ష్యం కారణంగా నశించిపోతున్నాయి. ముఖ్యంగా పలు రకాల క్రిమిసంహారక మందులు అతిగా పిచికారీ చేయటం వలన పంట మిత్ర పురుగులు వేగంగా నశించిపోతున్నాయని వ్యవసాయ అధికారులు అంటున్నారు.

అవసరం మేరకే పురుగు మందులు వినియోగించాలి



పంటలకు క్రిమి సంహారక మందులు అవసరం మేరకే వినియోగించాలి. కానీ కొందరు రైతులు మోతాదుకు మించి పిచికారీ చేస్తున్నారు. దీంతో పంటకు, రైతులకు ఎంతో మేలు చేకూర్చే పంట మిత్ర పురుగులు క్రమంగా అంతరించిపోతున్నాయి. పంటపై ఒకటి రెండు చీడ పురుగులు కనపడినంత మాత్రాన వెంటనే మందులు వాడాల్సిన అవసరం లేదు. పర్యావరణం ద్వారా, లేదా మిత్ర పురుగుల ద్వారా అవి నశిస్తాయి. అవి మరీ ఎక్కువగా కనిపిస్తే అవసరం మేరకు మాత్రమే క్రిమి సంహారక మందులు వినియోగించాలి. రైతులు క్రమేపీ క్రిమి సంహారక మందులకు స్వస్తి చెప్పి ప్రకృతి వ్యవసాయం చేపడితే మిత్ర పురుగులను కాపాడటంతో పాటు భూమికి మేలు చేకూర్చిన వారు అవుతారు.

– ఎం.వెంకటరామారావు, ఏడీఏ, కొత్తపేట

పరిపాలనలో నూతన ఒరవడి

- ఎమ్మెల్యే రాపాక
- శివకోడులో గడప గడపకూ మన ప్రభుత్వం



శివకోడులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: పరిపాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నూతన ఒరవడి తీసుకుని వచ్చారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం శివకోడులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే రాపాకకు సర్పంచ్ నక్కా రామారావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వివరించారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ సీఎం జగన్ సచివాలయ వ్యవస్థ అమలు చేసి పరిపాలన వికేంద్రీకరణ చేశారన్నారు. గతంలో చిన్న చిన్న పనుల కోసం, సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. అలాంటిది ఆయా గ్రామాల్లోనే సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేశారన్నారు. ముఖ్యంగా వలంటీరు వ్యవస్థ ద్వారా అన్ని ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయన్నారు. రాజోలు సొసైటీ అధ్యక్షుడు కూనప రెడ్డి రాంబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, సర్పంచ్‌లు కట్టా శ్రీనివాసరావు, రేవు జ్యోతి, నాయకులు చెల్లింగి చినబాబు, తిక్కిశెట్టి శ్రీనివాసరావు, కుంపట్ల చిన్నారి, ఆకుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హాస్టల్‌కు అదనపు వసతి, సౌకర్యాలు

సాంఘిక సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మి



వాడపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల మధ్య కూర్చున్న ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మి

కొత్తపేట: స్థానిక సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలుర వసతి గృహంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు వసతి, మరుగుదొడ్ల సంఖ్య పెంచేందుకు నిధులు కేటాయిస్తామని సాంఘిక సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.జయలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల సంఖ్య, వసతి సౌకర్యాలు, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. అదనపు గదులు, మరుగుదొడ్లతో పాటు డైనింగ్ హాలు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మండల పరిధిలోని వాడపాలెం పెదపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులతో కలిసి కింద కూర్చుని వారితో ముచ్చటించారు. మెనూ గురించి కార్యకర్త, ఆయాలను ఆరా తీశారు. రికార్డులను ఆట వస్తువులను, పిల్లల ఎత్తు, బరువులు గ్రోత్ మోనటరింగ్, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లలోని వస్తువుల నాణ్యతను పరిశీలించారు. రాగిపిండితో తయారు చేసిన వంటకాలను రుచి చూశారు. బాలింతలు, గర్భిణులు ఈ మాసంలో టేక్ హోమ్ రేషన్ ఎంతవరకు తీసుకున్నారు? అని రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట ఆర్‌డీఓ ఎం.ముక్కంటి, తహసీల్దార్ జీడీ కిషోర్ బాబు, ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కేవీ సత్యనారాయణ ఉన్నారు.

పేదలకు అందుబాటులో ‘మీ మెడిమిత్ర’

హెల్త్ ఔట్‌లెట్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, సినీ నటి అర్చన



మీ మెడిమిత్ర హెల్త్ ఔట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, చిత్రంలో సినీ నటి అర్చన తదితరులు

కొత్తపేట: ధనికులకే పరిమితమైన ప్రైవేట్ వైద్య సేవలు మీ మెడిమిత్ర హెల్త్ క్లినిక్స్ ద్వారా పేదలకు అందుబాటులోకి వచ్చాయని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం వీ స్టార్ హాస్పిటల్స్.. హెల్త్ ఔట్‌లెట్స్ ఏర్పాటులో భాగంగా కొత్తపేటలో ‘మీ మెడిమిత్ర హెల్త్ ఔట్‌లెట్’ను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, సినీ నటి అర్చనశాస్త్రి ప్రారంభించారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ‘మీ మెడిమిత్ర హెల్త్ ఔట్‌లెట్స్’ ఏర్పాటు చేయడం శుభపరిణామని అన్నారు. డాక్టర్ కె.వంశీకృష్ణ, డాక్టర్ వి.రవికాంత్‌రెడ్డి హెల్త్ ఔట్‌లెట్స్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సంస్థ సౌత్ ఇండియాలోనే మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడ) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, పీఏసీఎస్ అధ్యక్షుడు ముసునూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్ రెడ్డి చంటి, ఏఎంసీ డైరెక్టర్ సాకా జానకిరామరాజు, ఎంపీటీసీ సభ్యుడు దూళి సూరిబాబు, మాజీ సర్పంచ్ పితాని రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వల్ప అస్వస్థత

కొత్తపేట: మండల పరిధిలోని పలివెల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బల్లి పడిన మధ్యాహ్న భోజనం తిని స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. పలివెల శేరేపాలెం గ్రామానికి చెందిన అక్కాతమ్ముళ్లు మల్లవరపు లలితావల్లీ, మల్లవరపు వీరమహేంద్ర సోమవారం మధ్యాహ్న భోజనం చేశారు. కూర సరిపడక పోవడంతో ఎండీఎం నిర్వాహకులు తీసుకున్న కూర వేశారు. కూరలో బల్లి కనిపించడంతో ఆ అన్నం వదిలేశారు. ఈ విషయం ఉపాధ్యాయులకు చెప్పగా వారిద్దరినీ అబ్జర్వేషన్‌లో ఉంచారు. వారిలో ఏవిధమైన అనారోగ్య లక్షణాలు కనిపించలేదు. సాయంత్రం ఇంటికి వెళ్లిపోయారు. రాత్రి 10 గంటల సమయంలో వారిద్దరికీ నీరసంగా ఉండటంతో తల్లికి మధ్యాహ్న భోజనంలో బల్లి కనిపించిన విషయాన్ని చెప్పారు. దానితో వారిద్దరినీ కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యం అందించారు. దీనిపై ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్‌ను ఆరా తీయగా మధ్యాహ్న భోజనంలో బల్లి కనిపించిందని, తీవ్ర అస్వస్థతకు గురికాలేదన్నారు. డీఈఓ ఎం.కమలకుమారి మంగళవారం పాఠశాలకు వచ్చి విద్యార్థులను, ఉపాధ్యాయులను, ఎండీఎం నిర్వాహకులను విచారించారు.

బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు

ఆలమూరు: ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎంఎస్‌ఏ)ను సద్వినియోగం చేసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, శిరీష అన్నారు. పీఎంఎంఎస్‌ఏ పథకంలో భాగంగా ఆయా పీహెచ్‌సీలో నిర్వహించిన పీఎంఎంఎస్‌ఏలో 112 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. సీహెచ్‌ఓ పి.పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవివి.రాజా, బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

48 మందికి కంటి పరీక్షలు

పి.గన్నవరం: ముంగండ గ్రామంలోని మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్యులు మొత్తం 48 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. వారిలో 10 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయాలని నిర్ధారించినట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు.

సామాజిక తనిఖీ బహిరంగ సభ రేపు

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఉపాధి హామీ ఏపీఓ భారతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ 1-04-2022 నుంచి 31-03-2023 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 10గంటలకు సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధిహామీ కూలీలు హాజరు కావాలని ఆమె కోరారు.

15 నుంచి కన్యకాపరమేశ్వరి శరన్నవరాత్ర ఉత్సవాలు

అంబాజీపేట: స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాలు ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు శ్రీ వాసవీ వైశ్య సంఘ సభ్యులు తెలిపారు. అమ్మవారి శరన్నవరాత్ర ఉత్సవ శుభపత్రికలను మంగళవారం విడుదల చేశారు.

174 పనుల గుర్తింపు

మామిడికుదురు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరంలో 174 పనులు చేపట్టాలని పెదపట్నంలంక గ్రామసభలో తీర్మానించారు. సర్పంచ్ సుందరనీడి చిన్ని అధ్యక్షతన మంగళవారం గ్రామసభ జరిగింది. రూ.50 లక్షల విలువైన పనుల ద్వారా కూలీలకు 25 వేల పని దినాలు కల్పించాలని నిర్ణయించారు. ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, వార్డు సభ్యుడు కొమ్ముల దొరబాబు పాల్గొన్నారు.

మరిదిపై వదిన కత్తితో దాడి

అంబాజీపేట: స్థల వివాదం నేపథ్యంలో మంగళవారం మరిదిపై వదిన కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఇరుసుమండకు చెందిన మట్టా రామాంజనేయులు ఇంటి వద్ద ఉన్న స్తంభాల వద్ద అతని వదిన సుజాత గునపంతో తవ్వుతోంది. స్తంభాల వద్ద తవ్వ వద్దని రామాంజనేయులు భార్య సుధ అడ్డుకుంది. ఈ నేపథ్యంలో సుధ కింద పడిపోవడంతో ఆమె భర్త పైకి లేవదీసే ప్రయత్నం చేస్తుండగా సుజాత కత్తితో దాడి చేసింది. రామాంజనేయులు ఎడమ చేతికి తీవ్ర గాయాలు కాగా అమలాపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

ఆలమూరు: వెల్ఫేర్ స్టాంప్ ద్యూటీ తక్షణం తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆలమూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. రాష్ట్ర న్యాయవాదుల సంఘం పిలుపులో భాగంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సలాది వీర వెంకట సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.

వేధింపులను అరికట్టండి

ఆలమూరు: కొత్తూరు సెంటర్ వద్ద ప్రతిరోజు ఆకతాయిల అల్లరి, వేధింపులు శృతిమించుతున్నాయని స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం జిల్లా అఖిల భారత విద్యార్థి సమాఖ్య కన్వీనర్ రవికుమార్, సహాయ కార్యదర్శి కె. వెంకట్ ఫిర్యాదు చేశారు. విద్యార్థులు స్కూల్స్‌కు, కళాశాలలకు వస్తూ వెళుతుంటారని, వారిలో ఈ ఆకతాయిల వల్ల అభద్రతా భావం నెలకొందంటూ ఆలమూరు ఎస్సై శ్రీనివాస్ నాయక్‌కు ఇచ్చిన వినతి పత్రంలో వారు పేర్కొన్నారు.

ప్రజల ఆరోగ్యం కోసమే..



మలికిపురంలో మందులు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక



మాచవరంలో రోగులకు మందులను అందిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

మలికిపురం: ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసమే ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం మలికిపురం గ్రామ సచివాలయం-1 పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాపాక మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను ఎమ్మెల్యే రాపాక తిలకించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ని గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. వైద్యసేవలు పొందిన రోగులకు ఎమ్మెల్యే రాపాక ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, ఎంపీపీలు మేడిచర్ల సత్య వాణి, వీరా మల్లిబాబు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, ఎంపీటీసీ కొప్పిశెట్టి సీతామహాలక్ష్మి, పార్టీ నా యకులు కె.ఎ స్.ఎన్.రాజు, చింతా రాజబాబు, కొల్లాబత్తుల అశోక్ కుమార్, గెడ్డం తులసీభాస్కరరావు పాల్గొన్నారు.

పొన్నమండలో..

రాజోలు: పొన్నమండ గ్రామ సచివాలయం-1 పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ కుక్కల బేబికుమారి ప్రారంభించారు. తాటిపాక, రాజోలు పీహెచ్‌సీ, సీహెచ్‌సీకి చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సురక్ష శిబిరాన్ని, అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను డీఎల్‌డీఓ థామస్ సందర్శించారు. తహసీల్దారు బి.ఎం.ముక్తేశ్వరరావు, ఎంపీడీఓ ఎస్.బాలాజీ, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బండారు కాశీ, మట్టా ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే సురక్ష లక్ష్యం

అంబాజీపేట: ఆరోగ్యవంతమైన సమాజాన్ని స్థాపించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్యం అందిస్తున్నారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ అన్నారు. మాచవరం సచివాలయం -4లో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు ఎంపీడీఓ కె.సత్యనారాయణ పర్యవేక్షణలో మంగళవారం జరిగింది. వారు మాట్లాడుతూ సచివాలయ పరిధిలో 3,069 మంది ఉండగా 600 టోకెన్‌లను వైద్య సిబ్బంది అందజేశారన్నారు. వైద్య శిబిరానికి 480 మంది హాజరయ్యారన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు మట్టా పార్వతి, మట్టపర్తి వెంకటేశ్వరరావు, కుసుమ వరలక్ష్మి పాల్గొన్నారు.

విద్యకూ ప్రాధాన్యం

మామిడికుదురు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోగ్యంతో పాటు విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు కశిరెడ్డి అంజిబాబు పేర్కొన్నారు. మామిడికుదురు పెర్ల కాలువ గట్టు ప్రాథమిక పాఠశాల వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జెడ్పీటీసీ మంగళవారం ప్రారంభించారు. సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ అధ్యక్షతన జరిగిన సభలో జెడ్పీటీసీ మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజిషియన్‌తో ఇప్పటికే నెలలో రెండు పర్యాయాలు సచివాలయాల పరిధిలో డాక్టర్లు సేవలందిస్తుండగా దాన్ని మరింత ఉన్నతంగా నిర్వహించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టారని చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్, ఎంపీటీసీ సభ్యుడు వర్ధినేని రాము, కుసుమ శ్రీధర్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఆత్రేయపురం: మండల పరిధిలోని కట్టుంగలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబు, సర్పంచ్ కరుటూరి బ్రహ్మాజీ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ క్యాన్సర్ వంటిరోగాలకు కూడా ఆరోగ్యశ్రీ ఉచిత చికిత్స అందిస్తున్నారని, ఆరోగ్యశ్రీ ద్వారా 3,257 వ్యాధులకు 2,285 ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందవచ్చన్నారు. 504 మందికి వైద్య సేవలు అందించి 125 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీఓ నాతిబుజ్జి తెలిపారు. ఈఓపీఆర్‌డి డి.శ్రీనివాసరావు, ఏఓ సురేంద్రరెడ్డి, ఎంఈఓ వరప్రసాద్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం సందర్శన

సఖినేటిపల్లి: అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని డివిజినల్ లెవిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ థామస్ సందర్శించారు. శిబిరంలో రోగులకు వైద్య సిబ్బంది అందజేస్తున్న సేవలను ఆయన పరిశీలించారు. తొలుత ఎంపీడీవో జి.భీమారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ ప్రారంభించారు. జగనన్న కన్వీనర్ల సారథి మండల ఇన్‌చార్జి నల్లి మోహన్ పాల్గొన్నారు.

నాగుల్లంకలో...

పి.గన్నవరం: మండలంలోని నాగుల్లంక గ్రామంలో జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ యల్లమెల్లి కృష్ణవేణి మంగళవారం ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి వై.శ్రీవల్లి, వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు వెంకటేష్, కార్తీక్‌రెడ్డి, మౌనిక మణి, సీహెచ్ శ్రీనివాసరావు, సిబ్బంది వైద్య సేవలు అందించారు. మొత్తం 419 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వేంకటేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావు దొర, తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ ఎం.భారతి, పంచాయతీ కార్యదర్శి శరభరాజు పాల్గొన్నారు.

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో తహసీల్దార్ ఐపీ శెట్టి ఆధ్వర్యంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి చెందిన వైద్య నిపుణులు అరుణ, సీహెచ్‌సీ వైద్యాధికారి షమీ ఉన్నీసా, పీహెచ్‌సీ వైద్యాధికారులు ఆర్.మల్లికార్జున, పి.భవానీ శంకర్, సువర్చల దేవి 343 మందికి వైద్య సేవలు అందించారు. రోగులకు 105 రకాల మందులను ఉచితంగా అందజేశారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్నవారిని ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శిబిరానికి వచ్చిన ప్రజా ప్రతినిధులు, అధికారులకు సర్పంచ్ గుణ్ణం రాంబాబు టవల్స్‌ను పంపిణీ చేశారు. ఈఓ కె.మోక్షంజలి, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పి.శివ ప్రసాద్, ఆర్.బాలామణి, ఆరోగ్యశ్రీ నోడల్ అధికారి నామాల రామకృష్ణ పాల్గొన్నారు.

మాగంలో..

అయినవిల్లి: మండలంలోని మాగంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం సర్పంచ్ కాశి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. వైద్యులు ఎస్. సునీల్ 501 మంది రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తహసీల్దార్ సీహెచ్ లక్ష్మమ్మ, ఎంపీడీఓ తాడి శ్రీ వెంకటాచార్య, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, పీహెచ్‌సీ వైద్యులు బి.మంగాదేవి, మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఈఓపీఆర్డీ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

రావులపాలెం: మండలంలో ముమ్మిడివరప్పాడు సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఆర్‌బీకే సెంటర్ వద్ద నిర్వహించిన ఈ క్యాంపులో 416 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ చదలాడ ఆనందరావు, ఎంపీటీసీ సభ్యురాలు అడపా నాగలక్ష్మి, ఎంపీడీఓ జి.రాజేంద్ర ప్రసాద్, తహసీల్దార్ బి.ముత్యం జయరావు, డాక్టర్లు ఎస్.సాయిలేఖ, కె.స్వాతి, ప్రత్యేక వైద్యులు జి.శ్రావణి పాల్గొన్నారు.

రూ.100 కోట్లతో రక్షణ గోడల నిర్మాణం

- ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి వెల్లడి
- బడుగువానిలంకలో గడప గడపకూ



బడుగువానిలంకలో ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమాన్ని వివరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో పంట భూములు నదీ కోతకు గురికాకుండా రక్షించేందుకు రూ.100 కోట్లతో కరకట్టలతో పాటు అవసరమైన ప్రదేశాల్లో రక్షణ గోడలు నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఇప్పటికే మడికి పరిధిలో రిలయన్స్ సహకారంతో పనులు ప్రారంభించగా దశల వారీగా మండలంలోని లంక గ్రామాల నదీతీరం వెంబడి నిర్మాణాలను చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. బడుగువానిలంకలో రెండో విడత నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు వీరా రాజు, పార్టీ నేత కర్రి నాగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జగ్గిరెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల వల్ల కలిగిన ప్రయోజనాలతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటి వరకూ చేసిన కృషిని గణాంకాలతో సహా ప్రజలకు వివరించారు. గ్రామస్తులు లేవనెత్తిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తూ, సందేహాలను నివృత్తి చేస్తూ ముందుకు సాగారు. డి.పట్టాభూముల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం శ్రమిస్తున్న సీఎం జగన్‌ను రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు నవరత్న పథకాల వల్ల రికార్డు స్థాయిలో రూ 14.13 కోట్లు లబ్ధి చేకూర్చిన ప్రభుత్వానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు తోరాటి సీతా మహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ మోటుపల్లి వెంకన్న, నల్లి రాజు, దూలం సత్తిబాబు పాల్గొన్నారు.

సాగర్ కవచ్ ట్రయల్ రన్

సఖినేటిపల్లి: అంతర్వేది తీరంలో గస్తీ కాస్తున్న మెరైన్ సిబ్బందికి ఆగంతకులు తారసపడిన సందర్భంలో తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై సాగర్ కవచ్ ప్రోగ్రాంలో భాగంగా వారు ట్రయిల్ రన్ మంగళవారం నిర్వహించారు. అన్నా చెల్లెలు గట్టు వద్ద గస్తీ తిరుగుతున్న అంతర్వేది కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.పెద్దిరాజు, ఎస్సై పి.సోమశేఖర్‌రెడ్డి, సిబ్బందికి అనుమానాస్పదంగా ఓ బోటులో ఐదుగురు వ్యక్తుల తీరానికి వచ్చినట్టు గుర్తించారు. ఇందులో ఇద్దరు దిగి ఆర్‌డీఎక్స్‌తో లైట్ హౌస్ వెనుక భాగం నుంచి ఎటాక్ చేయడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో వారిని వెంబడించి పట్టుకొని తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న ఆర్‌డీఎక్స్ బాక్స్‌ను సీఐ పెద్దిరాజు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. సిబ్బంది రమేష్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, కుమార్, నాగార్జున, సతీష్ పాల్గొన్నారు.